సాక్షి తిరుపతి

శనివారం। 1। మార్చి। 2025

I



పుస్తక పఠనంతో పరిపక్వత

తిరుపతి సిటీ : విద్యార్థులకు పుస్తక పఠనంతో మానసిక పరిపక్వత పెంపొందుతుందని ప్రొఫెసర్ సి.వాణి తెలిపారు.



ఘనంగా టెక్‌ఫెస్ట్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం టెక్‌ఫెస్ట్ ఘనంగా ప్రారంభించారు.

శ్రీవారి సేవలో..

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం ప్రముఖ సినీ నటి హన్సిక, తెలంగాణ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు దర్శించుకున్నారు.



న్యూస్‌రీల్

తిరుమలలో అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షలు

తిరుమల: తిరుమలలో ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షలు విరాళంగా చెల్లించాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో ఉదయం అల్పాహారానికి రూ.10 లక్షలు, మధ్యాహ్న భోజనానికి రూ.17 లక్షలు, రాత్రి భోజనానికి రూ.17 లక్షలు ఖర్చు చేస్తామని పేర్కొంది. దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చని పేర్కొంది.

స్పోర్ట్స్ కోటాలో టీటీడీలో ఉద్యోగాల భర్తీ




క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్, ఈవో

తిరుపతి కల్చరల్: టీటీడీలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలను తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని పరేడ్ మైదానంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులతో టీటీడీ ఈవో శ్యామలరావు క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. చైర్మన్, ఈవో, ఏఈవో, జేఈవో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి రూ.2,000, రూ.1,800, రూ.1,600 విలువైన బ్యాంకు గిఫ్ట్ కార్డులు బహుమతులుగా అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పురుషులు, మహిళలకు వేరు వేరుగా.. అలాగే, ప్రత్యేక ప్రతిభావంతులకు, సీనియర్ అధికారులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ

తిరుపతి అర్బన్: తిరుమలలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలో ఉన్న పద్మావతి పార్క్‌లో ఈ ఏడాది జనవరి 8న జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కొనసాగుతోంది. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందగా, మరో 44 మంది గాయపడిన విషయం విదితమే. శుక్రవారం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముగ్గురు భక్తులను విచారణ చేశారు. తిరుపతి నెహ్రూవీధికి చెందిన ఓ భక్తుడు ఇంటి నుంచే తన మొబైల్ ద్వారా వర్చువల్ విధానంలో హాజరయ్యారు. అలాగే విశాఖపట్నంలోని గోపాలపట్నంకు చెందిన మరో మహిళా భక్తురాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన మరో భక్తుడు మొబైల్ ద్వారా వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యారు. ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 35 మందిని విచారణ చేశారు.

రైల్వే స్టేషన్‌లో తాగునీటి ఇక్కట్లు



మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

తిరుపతి మంగళం: నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో తాగునీటి సమస్య తాండవిస్తోందని, వెంటనే పరిష్కారం చూపాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఉన్న తాగునీటి కొళాయిలను మరమ్మతులు చేయించడంతోపాటు వేసవి నేపథ్యంలో అదనపు కొళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి తదితర రైల్వే స్టేషన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. చోరీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని వివరించారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్త కావాలి



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు(రేణిగుంట): దేశంలో సైన్స్ ప్రపంచదేశాలకు దీటుగా అభివృద్ధి చెందటం శాస్త్రవేత్తల వల్లే సాధ్యమైందని, ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐసర్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్యతో కలిసి విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ సాధన దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శాస్త్రవేత్తలు దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచం గర్వించే గొప్ప శాస్త్రవేత్త సీవీ రామన్ అని, తాను ఎనిమిదో తరగతిలో ఖగోళ శాస్త్రవేత్త కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఐసర్ విద్యార్థులు అబ్బురపరిచే ప్రయోగాలను రూపొందించి ప్రదర్శించారని అభినందించారు. కలెక్టర్ తన బాల్య జ్ఞాపకాలను పంచుకుంటూ.. తాను ఆకాశంలో నక్షత్రాలు, రాశులను చూసి ఆనందించేవాడినని, ఆస్ట్రోఫిజిసిస్ట్ కావాలని కలలు కన్నానని తెలిపారు. ఎంబీబీఎస్ పట్టా పొంది విశాఖపట్టణంలోని కేజీహెచ్‌లో పనిచేశానని, తర్వాత ఐఏఎస్ అయ్యానని తెలిపారు. ఐసర్ విద్యార్థులు సుమారు 100కు పైగా నమూనాలను ప్రదర్శించారు. వాటిని తిలకించేందుకు ఏర్పేడు, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, వేదాంతపురం, శ్రీసిటీల నుంచి 800 మంది విద్యార్థులు వచ్చారు.

పెళ్లి కళ

- కల్యాణానికి సిద్ధమైన స్వామి, అమ్మవార్లు
- పోటెత్తిన భక్తులు
- ఒక్కటైన జంటలు



అధికార నంది, కామధేనువుపై స్వామి, అమ్మవార్లు



గజ వాహనంపై స్వామివారు



సింహ వాహనంపై అమ్మవారు



పెళ్లి పందిరి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు అధికార నందిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారు కామధేనువుపై దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెళ్లి కుమారుడిగా ముస్తాబైన శివయ్య గజవాహనంపై, జ్ఞానాంబిక సింహ వాహనంపై ఆశీనులై పెళ్లిమండపానికి వేంచేశారు.

వధూవరులకు బంగారు తాళిబొట్లు

- బియ్యపు మధుసూదన్ రెడ్డి కానుక

శ్రీకాళహస్తి: శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా నూతన వధూవరులకు స్థానిక మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం రాత్రి బంగారు తాళిబొట్లు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాదాపు 20 ఏళ్లుగా పేదలకు బంగారు తాళిబొట్లు కానుకగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా నూతన వధూవరులకు నూతన వస్త్రాలు, బంగారు తాళి బొట్లు పంపిణీ చేశారు. ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు పగడాల రాజు, కంటా ఉదయ్ కుమార్, ఉత్తరాజీ శరవణకుమార్, సిరాజ్ బాషా, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, గరికపాటి చంద్ర , పఠాన్ ఫరీద్, చిందేపల్లి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



బంగారు తాళిబొట్లు పంపిణీ చేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోతలేనా.. కేశవా ?

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు, మహిళలకు కోతలు..వాతలేనని తేలిపోయింది. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్‌కు పంగనామం పెడుతున్నట్టు స్పష్టమైంది. మహిళా శక్తికి రిక్తహస్తమే ఎదురైంది. అన్నదాత సుఖీభవకు మొండిచెయ్యే మిగిలింది. ఉచిత బస్సు మూగబోయింది. ఫీజురీయింబర్స్‌మెంట్ అటకెక్కింది. సాగు, తాగునీటికి నిధుల వరద పారనంది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కష్టకాలం దాపురించింది. అలవిగాని హామీలు అమలు చేయలేమని సుస్పష్టంగా కూటమి ప్రభుత్వం ఒప్పుకున్నట్టు తేటతెల్లమైంది.



- సంక్షేమానికి అరకొర బడ్జెట్
- నిరుద్యోగభృతి, ఉచిత బస్సు ఊసేలేదు
- సూపర్ సిక్స్‌కు చెక్
- ప్రతినెలా ఒక్కో మహిళకు రూ.1,500పై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో తాగు, సాగునీటికి మొండి చెయ్యి
- బడ్జెట్‌పై నిప్పులు చెరుగుతున్న మేధావులు

తిరుపతి సిటీ: షరా మామూలే. సంక్షేమానికి మళ్లీ టోకరా పెట్టేశారు. అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మేధావులు, వామపక్షాలు పెదవి విరుస్తున్నాయి. తిరుపతి జిల్లాకు తిరునామం పెడుతూ ఏ రంగంలోనూ బడ్జెట్ గణాంకాల్లో జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం మాటవరుసకైనా జిల్లా ప్రస్తావన లేకపోవడంపై మండిపడుతున్నారు. గత ఏడాది 2024–25 బడ్జెట్‌లో ప్రస్తావించిన అంశాలను ఇంకాస్తా గణాంకాలు జోడించి అమలుకు వీలుకాని అంకెలను పొందుపరుస్తూ మంత్రి ప్రసంగం కొనసాగింది. దీనిపై రైతులు, మహిళలు నిప్పులు చెరుగుతున్నారు.

సూపర్ సిక్స్‌కు పంగనామం

2025–26 బడ్జెట్ గణాంకాలు మహిళలను తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి. గత బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు చోటివ్వని కూటమి ప్రభుత్వం ఈసారైనా కరుణించకపోతుందా అని ఎదురు చూసిన మహిళలకు నిరాశే మిగిలింది. మహిళాశక్తి పేరుతో కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందిస్తామని చెప్పి బడ్జెట్‌లో మాటెత్తకుండా మంగళం పాడేసింది. మహిళలకు ఉచిత బస్సు ఊసేలేదు. తల్లికి వందనం పథకానికి రూ.8వేల కోట్లు కేటాయిండంపై పెదవి విరుస్తున్నారు. తిరుపతి జిల్లాలోని సుమారు 3లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ములో కనీసం 30శాతం మందికి కూడా సరిపోదనే వాదనలు వినిపిస్తున్నాయి.

గిట్టుబాటు ధర ఏదీ?

జిల్లాలోని 2.51 లక్షల మంది రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. వ్యవసాయ బడ్జెట్ అంటూ ప్రత్యేకంగా మంత్రి అచ్చెం నాయుడు అసెంబ్లీలో చదివిన గణాంకాలపై నోరెళ్లబెడుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకుండా నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. గత ప్రభుత్వం ధరలస్థిరీకరణ నిధి రూ.3వేల కోట్లు కేటాయించింది. కూటమి ప్రభుత్వం కేవలం రూ.300 కోట్లు కేటాయించడం దారుణమని మండిపడుతున్నారు. అన్నదాత సుఖీభవకు గత ఏడాది రూ.4వేల కోట్లు కేటాయించి అములు చేయలేదు. మళ్లీ 2025–26 బడ్జెట్‌లో నిధులు కేటాయించడం చూస్తే కనీసం జిల్లాలోని సగం మందికి కూడా ఈ పథకాన్ని వర్తించే పరిస్థితి లేదు.

జిల్లాలో లబ్ధిదారుల సమాచారం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య (లక్షల్లో)
తల్లికి వందనం	3.56
అన్నదాత సుఖీభవ	2.51
నిరుద్యోగ భృతి	5.74
ఉచిత బస్సు	12.87
మహిళాశక్తి (నెలకు ప్రతిమహిళకు రూ.1500)	9.06
డ్వాక్రా మహిళలు	6.40
మత్స్యకారులు	12
ఉచిత గ్యాస్	5.25

‘కోత’ల బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కోతలమయంగా ఉంది. తల్లికి వందనం పథకానికి రూ.12,000 కోట్లు రావాల్సి ఉంటే 8,276 కోట్లు కేటాయించారు. దీపం పథకానికి సంబంధించి 1.5 కోట్ల మంది లబ్ధిదారులు ఉంటే అందులో 90 లక్షలకు తగ్గించారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.10,400 కోట్లు కావాల్సి ఉంటే బడ్జెట్‌లో రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇలా అన్ని పథకాలకు కోతలు విధించారు. ఇవి అమలు చేసేందుకేనా.. అనే అనుమానం కలుగుతోంది.

– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

పసలేని బడ్జెట్



తొమ్మిదినెలల పాలనలో అందరి ఆశల్ని దగా చేసే పద్ధతిలో రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారు. బడ్జెట్‌లో సూపర్ సిక్స్ ఎక్కడ ఉందో అర్థం కావడంలేదు. పోయిన బడ్జెట్‌లో 63 పేరాలుంటే, రెండు పేరాలకు మాత్రమే సూపర్ సిక్స్‌కు ఇచ్చారు. స్థూల ఉత్పత్తిపై కూటమి ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పింది.

– యండపల్లి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

ఎవరికి ఉపయోగం



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాగాడంబర బడ్జెట్ ఎవరికి ఉపయోగం..? వేతన జీవులకు మొండి చెయ్యి చూపించారు. నిత్యావసరాల ధర పెరుగుదల, పీఆర్‌సీ ప్రస్తావన, కార్మికులు, వేతనాల పెరుగుదల ఊసేలేదు. వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి పీకేశారు.

-కందారపు మురళి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు

నీటి ప్రాజెక్టులపై సీతకన్ను



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమ తాగు, సాగు నీటి ప్రాజెక్టులపై సీతకన్ను పడింది. సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్, గాలేరు–నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు స్వల్పంగా కేటాయించారు.

-ఎం పురుషోత్తంరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త

అంకెల గారిడీ



కూటమి ప్రభుత్వం హామీల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీ. రాజకీయ పత్రంగా ఉంది. మహిళలు, మైనారిటీలు, బడుగుబలహీన వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.

-వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పేదల వ్యతిరేక బడ్జెట్



బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప అభివృద్ధి లేదు. ఉత్పాదకరంగం ఊసే ఎత్తకుండా సంపద సృష్టి ఎలా సాధ్యమో అర్థం కావడం లేదు. ఈ బడ్జెట్ పూర్తిగా అప్పుల సాధనకు పనికివచ్చేదే తప్ప ప్రజల సంక్షేమానికి ఉపయోగపడదు.

-పీ.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

రైతుకు రిక్తహస్తం



రైతాంగానికి నిరాశేమిగిలింది. గిట్టుబాటు ధరను పక్కన పెట్టేసింది. కనీస మద్దతు ధర నిర్ణయించేందుకు ధరల స్థిరీకరణ నిధికి రూ.300కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా మిగిలిపోయింది.

-బాలకృష్ణ, రైతు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఏర్పేడు

ఆరోగ్యశ్రీకి మంగళం



ఆరోగ్యశ్రీపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిరుపేదల ప్రాణాలకు కూటమి ప్రభుత్వం భోరసా కల్పించలేదు. ఆరోగ్య బీమా పేరుతో పేదలను వచంనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తోంది.

సుభాషిణి, గృహిణి, తిరుపతి

మహిళలకు శఠగోపం



జిల్లాలో సుమారు 2లక్షల మంది తల్లికి వందనం పథకానికి అర్హులు ఉన్నారు. అలాగే ఉచిత బస్సు, ప్రతి మహిళకు మహిళాశక్తి పథకం ఊసేలేదు. మహిళలకు బాబు సర్కార్ శఠగోపం పెట్టేసింది.

-ఆర్ ఆషా, పీడీఎస్‌ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

జాబ్ క్యాలెండర్ ఎక్కడ



నిరుద్యోగ భృతి మాటే లేదు. జాబ్ క్యాలెండర్‌పైనా ప్రకటన చేయలేదు. నెలకు ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు కేటాయిస్తామని మోస పూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. -ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు

ఐఆర్ ఊసే లేదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి (ఐఆర్)కు సంబంధించి ఊసే లేదు. ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలపై ప్రకటన చేయలేదు.

-ఎస్.బాలాజీ, రాష్ట్ర అధ్యక్షులు, ఆపస్

నిరాశ మిగిల్చిన బడ్జెట్



బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తీవ్ర నిరాశను మిగిల్చింది. పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, డీఏ బకాయి ఊసే లేకపోవడం బాధాకరం. -కె.ముత్యాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

పింఛన్ల కోత.. పండుటాకులకు వాత!

9 నెలల్లో 8,722 పింఛన్ల తగ్గింపు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అభాగ్యులు, దివ్యాంగులు, పండుటాకులతో చెడుగుడు ఆడుతోంది. బతుకు జీవనానికి చుక్కానిగా ఉన్న పింఛన్లకు కోత విధిస్తూ రోడ్డున పడేస్తోంది. కొత్తపింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న పింఛన్లు తొలగించడం విమర్శలకు తావిస్తోంది. గడిచిన తొమ్మిది నెలల్లో జిల్లా వ్యాప్తంగా 8,722 పింఛన్లను పక్కన పెట్టేసింది. గత ఫిబ్రవరిలో 2,63,191 మందికి పింఛన్లు ఇవ్వగా.. మార్చి నెల వచ్చేసరికి 2,62,461 మందికి పరిమితం చేసింది.

ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వండి



లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి. శనివారం ఉదయం 7 నుంచే పింఛన్ల ప్రక్రియ మొదలు పెట్టాలి. మార్చి లో 2,62,461 మందికిగాను రూ.112.06 కోట్లు నగదు ఇవ్వాల్సి ఉంది. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీఓలు పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలి. -ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

పింఛన్ల కోత ఇలా

నెల	పింఛన్ల సంఖ్య
జూన్	2,71,183
జూలై	2,69,162
ఆగస్ట్	2,67,772
సెప్టెంబర్	2,67,089
అక్టోబర్	2,66,342
నవంబర్	2,65,488
డిసెంబర్	2,64,636
జనవరి	2,63,995
ఫిబ్రవరి	2,63,191
మార్చి	2,62,461

అవినీతి అధికారుల గుండెల్లో దడ!

- రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డ చంద్రగిరి పంచాయతీ ఈఓ
- నాడు స్థానిక ముఖ్యప్రజాప్రతినిధి సతీమణికి రూ.50 లక్షలు సమర్పణ!
- ఏసీబీ అధికారుల చేతిలో కీలక సమాచారం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అవినీతి అధికారుల గుండెల్లో దడ మొదలైంది. ప్రజాప్రతినిధులకు లంచమిచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న వారి వెన్నులో వణుకు పుడుతోంది. ఏసీబీ అధికారుల చేతిలో కీలక ఆధారాలు ఉండడంతో ఆందోళన రేకెత్తుతోంది.

పోస్టింగ్‌లు.. పైరవీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల బదిలీలు మొదలయ్యాయి. తిరుపతికి సమీపంలో చంద్రగిరి నియోజకవర్గం ఉండడంతో పోస్టింగ్ ల కోసం ఉద్యోగులు పైరవీలు చేశారు. ఈ క్రమంలోనే పెద్ద మొత్తంలో నియోజకవర్గ ముఖ్యప్రజాప్రతినిధి సతీమణికి ముడుపులు చెల్లించినట్టు దుమారం రేగింది. ఇలా పోస్టింగులు తెచ్చుకున్న ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే అక్రమ వసూళ్లకు తెరలేపారు. ప్రజలను మామూళ్ల కోసం వేధించడం మొదలు పెట్టారు. కడుపు మండిన వారు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు.



పట్టుబడిన నగదుతో ఈవో మహేశ్వరయ్య



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ అధికారుల చేతిలో కీలక ఆధారాలు

చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య లంచగొండుతనమంతా ఏసీబీ అధికారుల చేతుల్లో ఉన్నట్టు సమాచారం. ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్ దినేష్ దగ్గర సంబంధిత అధికారులు ఒక చిప్ ఇచ్చి అతని ద్వారా పోలీసులు ట్రాప్ చేసినట్టు సమాచారం. నాలుగు రోజుల నుంచి వారిద్దరి మధ్యన జరిగిన సంభాషణ మొత్తం రికార్డు చేసుకున్నట్టుగా తెలుస్తోంది. అందులోనే ఈవో పోస్టుకు రూ.50 లక్షలు స్థానిక ప్రజాప్రతినిధి సతీమణికి అందజేసినట్టుగా చెప్పిన మాటలు కూడా రికార్డు అయినట్టు సమాచారం. ఆ సంభాషణను విన్న తర్వాత ఏసీబీ అధికారులు బాధితుడు దినేష్ చేతికి రూ.50 వేలు ఇచ్చి ఈవో మహేశ్వరయ్యకు ఇప్పించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

లంచగొండు అధికారుల గుండెల్లో గుబులు

చంద్రగిరి మేజర్ పంచాయతీలో జరిగిన ఏసీబీ దాడులతో నియోజకవర్గంలో కాసులు చెల్లించి పోస్టింగులు తెచ్చుకున్న అధికారుల గుండెల్లో గుబులు పట్టుకుంది. ముడుపులు చెల్లించి లంచావతారం ఎత్తిన అధికారులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్ కార్యాలయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులు కొందరు దీర్ఘకాలిక సెలవు పెట్టడానికి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

ఈవోగా కొనసాగడానికి రూ.50 లక్షలు ఇచ్చా!

‘చంద్రగిరి పంచాయతీ ఈవోగా రావడానికి స్థానిక ప్రజాప్రతినిధి సతీమణికి రూ.50 లక్షలు లంచంగా ఇచ్చా. మీలాంటి వాళ్లు ఇవ్వకుంటే నేను ఆ డబ్బు ఎలా సంపాదించాలి. నా కుటుంబం ఏమైపోతుంది. నేను అడిగినంత ఇస్తేనే బిల్లు పాస్ చేస్తా’నని చంద్రగిరి పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య తేల్చిచెప్పారు. ఎంబుక్‌లు, రికార్డు చేసినందున రూ.50 వేలు ఇవ్వాలని చిన్నగొట్టిగల్లుకు చెందిన కాంట్రాక్టర్ దినేష్‌ను డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినకపోవడంతో దినేష్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు ఈఓ మహేశ్వరయ్య రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.